
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
గురువారం 12 సెప్టెంబరు 2024



వరద బాధితుల సేవలో యువ వైద్యుడు

చట్రాపల్లి క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు

రోగులను తరలించే మార్గం లేక ప్రత్యామ్నాయంగా చికిత్స

ఆదివాసీల మన్ననలు అందుకుంటున్న డాక్టర్ సందీప్

-వార్త 8వ పేజీలో..



డాక్టర్ సందీప్

కూటమి సర్కారులో వైసీపీ నేతల హవా?

- ఎమ్మెల్యే ఫిర్యాదు చేసిన వెంటనే జిల్లా స్థాయి అధికారి బదిలీ
- విచారణ జరపకుండానే కలెక్టర్ చర్యలు
- సంబరాలు చేసుకుంటున్న వైసీపీ శ్రేణులు
- పోలీస్ శాఖదీ అదే తీరు
- చర్చనీయాంశంగా జిల్లాలో పరిపాలనా వ్యవహారం



అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్


(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గత ఐదేళ్లు పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాల్లో వార్డు సభ్యుడు మొదలుకుని శాసనసభ్యుడి వరకు అందరూ వైసీపీకి చెందిన వాళ్లే ఉండడంతో పాటు ఆ పార్టీ అధికారంలో ఉండడంతో అధికార యంత్రాంగం సైతం వారి అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకోవడం సహజం. కానీ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నప్పటికీ జిల్లాలో మాత్రం ఇంకా వైసీపీ పాలనే కొనసాగుతున్నదా? అనే విధంగా పరిస్థితులుండడం విమర్శలకు తావిస్తున్నది. పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు సైతం వైసీపీకి చెందిన వారే కావడంతో పాటు కూటమి నుంచి నామినేటెడ్ లేదా మరో విధంగా అధికారం ఉన్న నేతలు లేకపోవడంతో వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధుల హవా కొనసాగుతున్నదని స్పష్టమవుతున్నది.

స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సిఫారసులను స్థానిక గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు కనీసం పట్టించుకోవడం లేదని ప్రచారం జరుగుతున్నది. తాను చెప్పిన ఏ పనిని టీడబ్ల్యూ డీడీ చేయడం లేదని గత రెండు నెలలుగా స్థానిక ఎమ్మెల్యే గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో ఆయనకు వ్యతిరేకంగా ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా చేస్తానని ఎమ్మెల్యే గత నెలలో ప్రకటించారు. అయితే తిరుపతి ప్రయాణం ఉండడంతో ఆయన ధర్నాను విరమించుకున్నారు. కాగా ఈ నెల 4న టీడబ్ల్యూ డీడీ కొండలరావుపై కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కొండలరావును ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఉంచకూడదని కలెక్టర్‌కు సూచించారు. దీంతో ఇదే అదనుగా కలెక్టర్ దినేశ్‌కుమార్ అదే రోజు స్థానిక టీడబ్ల్యూ డీడీ కొండలరావును రంపచోడవరం బదిలీ చేస్తూ ఉత్తర్వులు సిద్ధం చేయడం, 5వ తేదీన డీఆర్‌వో, కలెక్టరేట్ ఏవో కౌంటర్ సైన్ సైతం చేయగా, ఈ నెల 9న కలెక్టర్ సంతకం చేసి ఉత్తర్వులు బట్వాడా చేసేశారు. దీంతో తమ ఎమ్మెల్యే ఒక్క ఫిర్యాదుతో టీడబ్ల్యూ డీడీపై బదిలీ వేటు పడిందని వైసీపీ శ్రేణులు తమ వాట్సాప్ గ్రూప్‌ల్లో సంబరాలు చేసుకుంటున్నారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుపై కనీస విచారణ లేకుండా..

ఎటువంటి అధికారి, ఉద్యోగిపైనైనా ఆరోపణలు లేదా అభియోగాలు వచ్చినప్పుడు ప్రాథమిక విచారణ చేయడం ... మిగతా 8వ పేజీలో



ఈ నెల 4న టీడబ్ల్యూ డీడీపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఇచ్చిన ఫిర్యాదు



PROCEEDINGS OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE, ASR DIST
PRESENT: SRI A.S. DINESH KUMAR I.A.S.

ORDER :

These orders come in to force with immediate effect.

District Collector
Alluri Sitharama Raju District

ఈ నెల 5న కలెక్టరేట్‌లో తయారైన టీడబ్ల్యూ డీడీ బదిలీ ఉత్తర్వులు

చట్రాపల్లి గిరిజనులకు ప్రభుత్వం అండ

క్షతగాత్రులను మైదాన ప్రాంతాలకు తరలింపు, మెరుగైన వైద్యం

- ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.మూడు వేలు
- నెలకు సరిపడా రేషన్ సరకుల పంపిణీ
- పక్కా గృహాల నిర్మాణానికి చర్యలు
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



చట్రాపల్లిలో పర్యటిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 11: కొండచరియలు విరిగిపడడంతో ఇళ్లు, పశు సంపద, ఆస్తులు నష్టపోయిన చట్రాపల్లి గిరిజనులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. బుధవారం ఆయన చట్రాపల్లి గ్రామానికి చేరుకున్నారు. తొలుత సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు పండన్న, సుమిత్ర, సుబ్బారావులను పరామర్శించి, బాధితులను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించాలని రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న చట్రాపల్లి గిరిజనులు ఒక్కొక్కరికి నెలకు సరిపడా బియ్యం, పప్పుధాన్యాలు, నూనె, సబ్బులు, ఇతర నిత్యావసర సరకులు, దుస్తులు, దుప్పట్లు అందజేశారు. స్థానిక గిరిజనులతో కలిసి పునరావాస కేంద్రంలో ఆయన భోజనం చేశారు. అక్కడ నుంచి చట్రాపల్లి చేరుకుని కొండచరియలు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్రాపల్లి గ్రామంపై కొండచరియలు విరుచుకుపడడం బాధాకరమన్నారు. ఓ మహిళ మృతి చెందడం, ముగ్గురు తీవ్రంగా గాయపడడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారన్నారు. యుద్ధప్రాతిపదికన చట్రాపల్లి గిరిజనులకు పునరావాసం కల్పించాలని, అధిక వర్షాలకు ధ్వంసమైన రహదారులు పునరుద్ధరించాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. జిల్లా యంత్రాంగంగా చట్రాపల్లి గిరిజనులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు పనిచేస్తుందన్నారు. సీలేరు- జీకేవీధి ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మూడు రోజుల్లో అంబులెన్స్, మినీ వ్యాన్లు వెళ్లే తాత్కాలిక మార్గాన్ని సిద్ధం చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఈపీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. ఈపీడీసీఎల్ సిబ్బంది పునరుద్ధరణ పనులను వేగంగా చేపడుతున్నారని ఆయన చెప్పారు.

ప్రతి కుటుంబానికి తక్షణ సహాయం

చట్రాపల్లి గిరిజనులకు తక్షణ సాయంగా ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి రూ.3 వేలు అందజేస్తుందని పీవో అభిషేక్ తెలిపారు. ఈ నగదును వెంటనే గిరిజనుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తామన్నారు. గిరిజనులు నష్టపోయిన పశుసంపద వివరాలు సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. పశుసంపదను నష్టపోయిన గిరిజనులకు పరిహారం అందజేస్తామన్నారు.

గ్రామంలో పక్కా గృహాలు

చట్రాపల్లి గ్రామంలో ప్రతి కుటుంబానికి పక్కా గృహం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కొండకు దిగువన గిరిజనులు ఇళ్లు నిర్మించుకోవడం వల్ల పెను ప్రమాదం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రమాదంలేని స్థలాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగు పనులను చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించామన్నారు. చట్రాపల్లి గిరిజనులు అధైర్యపడాల్సిన పనిలేదని, ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయి సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, ఏఈఈ యాదకిశోర్, డీటీ కుమారస్వామి, ఈవోఆర్డీ పాపారావు, వైద్యాధికారి ఈశ్వర్ సందీప్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఈపీడీసీఎల్ ఏఈఈలు భగవంతరావు, జ్యోతిబాబు, ప్రభాకరరావు ఉన్నారు.

యుద్ధప్రాతిపదికన రోడ్ల పునరుద్ధరణ

- జీకేవీధి-సీలేరు ప్రధాన రహదారి పనులు వేగవంతం
- అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం



సప్పర్ల-లంకపాకల రోడ్డులో విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్న దృశ్యం

పాడేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరదల నేపథ్యంలో రహదారుల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అధికారులు స్థానికంగా గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. అందుబాటులో ఉన్న నిధులను విడుదల చేస్తామని, నిధుల గురించి ఆలోచించకుండా అవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. చేపట్టే చర్యలపై ప్రజల నుంచి విమర్శలు, ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పక్కాగా చేయాలన్నారు. జీకేవీధి- సీలేరు ప్రధాన రహదారి పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. శానిటేషన్ పనులు, అప్రోచ్ రోడ్డు పనులు, గ్రామాల్లో అంతర్గత రహదారుల పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. చింతూరు, వీఆర్ పురం, కూనవరం మండలాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలన్నారు. జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. సర్పంచులతో మాట్లాడి తాగునీటి సమస్యలు, విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహాచలం, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాలసుందర బాబు, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, జిల్లాలోని వివిధ ... మిగతా 8వ పేజీలో



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్



అన్నవరం గ్రామంలో ధ్వంసమైన మత్స్యరాజు ఇల్లు

వరదకు ఇళ్లు ధ్వంసం

గుమ్మిరేవుల పంచాయతీలో దెబ్బతిన్న మూడు ఇళ్లు

సీలేరు, సెప్టెంబరు 11: తీవ్ర వాయుగుండం ప్రభావంతో మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ పంచాయతీలోని మాదిమళ్లు గ్రామంలో వాగు ఉధృతంగా ప్రవహించి ధనుర్జయ్ అనే గిరిజనుడి ఇలు కొట్టుకుపోయింది. ఆ సమయంలో ఇంట్లోని సామగ్రిని తీసుకునే అవకాశం లేకుండాపోయిందని, కట్టుబట్టలతో మిగిలామని బాధిత కుటుంబం తెలిపింది. అలాగే అదే పంచాయతీకి చెందిన అన్నవరం గ్రామానికి చెందిన కిముడు మత్స్యరాజు, కిల్లో తన్ని అనే ఇద్దరు గిరిజనుల ఇళ్లు కూడా వరద ఉధృతికి ధ్వంసమయ్యాయి. అధికారులు తమను ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.



బలిమెల జలాశయం నుంచి గుంటవాడ జలాశయానికి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

బలిమెల నుంచి నీరు విడుదల

21 వేల క్యూసెక్కులు దిగువకు..

సీలేరు, సెప్టెంబరు 11: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని బలమెల జలాశయం నుంచి బుధవారం సాయంత్రం 21 వేల క్యూసెక్కుల నీటిని గుంటవాడ జలాశయంలోకి విడుదల చేశారు. ఈ మేరకు బలిమెల జలాశయం దిగువన ఉన్న గ్రామాల ప్రజలను జెన్‌కో అధికారులు అప్రమత్తం చేశారు. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,516 అడుగులు కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు జోలాపుట్టు, డుడుమా జలాశయాలు, ఇతర నదీ పరివాహక ప్రాంతాల నుంచి లక్షా 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. బుధవారం మధ్యాహ్నం నాటికి బలిమెల జలాశయం నీటిమట్టం 1,512.30 అడుగులకు చేరడంతో ఒడిశా అధికారులు అప్రమత్తమై దిగువకు నీరు విడుదలకు చర్యలు చేపట్టారు. ముందుగా సీలేరు జెన్‌కో అధికారులకు సమాచారం ఇచ్చి దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటల నుంచి రెండు గేట్లు ద్వారా 21 వేల క్యూసెక్కుల నీటిని గుంటవాడ జలాశయంలోకి విడుదల చేశారు. గుంటవాడ జలాశయంలో ప్రస్తుతం 1,351 అడుగుల నీటిమట్టం ఉంది. ఈ నీటిమట్టం 1,355 అడుగులకు చేరితే గుంటవాడ జలాశయం నుంచి కూడా నీటిని దిగువకు విడుదల చేయడానికి సిబ్బందిని అధికారులు సిద్ధం చేశారు.

డొంకరాయి నుంచి 2 వేల క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి బుధవారం సాయంత్రం రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వర్షాలు ... మిగతా 8వ పేజీలో

గిట్టుబాటు ధర లేని సీతాఫలాలు

వారపు సంతలో 80 కాయల బుట్ట రూ.230 నుంచి రూ.300కు విక్రయాలు 8



కొనసాగుతున్న వాగుల ఉధృతి

చింతపల్లి, సెప్టెంబరు 11: మండలంలో వాగులు ఉధృతి కొనసాగుతున్నది. అధిక వర్షాలకు మూడు రోజులుగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం నాటికి కూడా వాగుల్లో నీటి ప్రవాహం తగ్గలేదు. దీంతో ఆదివాసీలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా చెరువూరు, తడ్డపల్లి, బలభద్రం, యర్నాపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చౌడుపల్లి చెరువు వద్ద వాగు రోడ్డు పైనుంచి నీరు ప్రవహిస్తున్నది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

← రహదారి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న చౌడుపల్లి వాగు

ఆడుకునేందుకు వెళ్లి మృత్యువాత

కొండవాగు ప్రవాహంలో కొట్టుకుపోయిన బధిర బాలిక

గోధుమలంక గ్రామంలో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి..



హిందూ మృతదేహం

కొయ్యూరు, సెప్టెంబరు 11: వర్షం తెరిపి ఇవ్వడంతో ఆడుకునేందుకు వెళ్లిన ఓ బధిర బాలిక ప్రమాదవశాత్తూ కొండవాగు ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందింది. ఈ విషయం బుధవారం సాయంత్రం గోధుమలంక గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గోధుమలంక గ్రామానికి చెందిన పాంగి సన్యాసిరావు, కాసులి దంపతులకు నలుగురు పిల్లలు. వారిలో పాంగి హిందూ(7) మూడవ సంతానం. ఆ బాలికకు పుట్టుకతోనే మాటలు రావు. కాగా మంగళవారం మధ్యాహ్నం వర్షం తెరిపి ఇవ్వడంతో ఆడుకునేందుకు బయటకు వెళ్లింది. తండ్రి సన్యాసిరావు పశువులను మేపేందుకు వెళ్లగా, తల్లి కాసులి మిగతా పిల్లలతో ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం వెళ్లిన కుమార్తె సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు చుట్టుపక్కల వెదికారు. అయినా ఫలితం లేకపోయింది. బుధవారం ఉదయం నుంచి కొండవాగు ప్రవాహంలో గాలించగా సాయంత్రం 5 గంటల సమయంలో ఊరికి కిలోమీటరు దూరంలో గల గోధుమలంక- తీగలమెట్ట గ్రామాల మధ్యలో బొంజంగి గుమ్మి మణుగులో ఆ బాలిక మృతదేహం కనిపించింది. కొండవాగులో కొట్టుకుపోతున్న సమయంలో బధిర బాలిక కావడంతో కేకలు వేయలేకపోయి ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. చలాకీగా ఉండే ఆ బాలిక మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

క్రైం... crime news

గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలిక మృతి



బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 11: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొనంతో బాలిక మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోమళ్లపూడికి చెందిన గొన్నా మహాలక్ష్మినాయుడు, సంతోషి దంపతుల కుమార్తె షర్మిలదుర్గ (6) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల ముగిసిన తర్వాత స్థానిక రామాలయంలో ఉచితంగా బోధిస్తున్న తరగతులకు హాజరైంది. క్లాస్ అయిపోగానే సాయంత్రం ఆరు గంటలకు బీఎన్ రోడ్డు అవతల ఉన్న తన ఇంటికి బయలుదేరి రోడ్డు దాటుతుండగా వడ్డాది నుంచి రావికమతం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం సంతోష్‌దుర్గను బలంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలికను తండ్రి మహాలక్ష్మినాయుడు రావికమతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే బాలిక మృతి చెందినట్టు చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా మహాలక్ష్మినాయుడు దంపతులకు కుమారుడు, కుమార్తె ఇద్దరు సంతానం.

బొగ్గు లారీ బోల్తా



వెంకన్నపాలెం వద్ద బోల్తా పడిన బొగ్గు లారీ

మాకవరపాలెం, సెప్టెంబరు 11: మండలంలోని వెంకన్నపాలెం వద్ద బొగ్గు లారీ బోల్తా పడింది. ప్రస్తుతం వెంకన్నపాలెం వద్ద రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ క్రమంలో మండలంలో ఉన్న అల్యూమినియం కంపెనీకి బుధవారం ఉదయం విశాఖపట్నం నుంచి వస్తున్న బొగ్గు లారీ అక్కడకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న బొగ్గు పక్కనే ఉన్న మామిడి తోటలో ఒరిగిపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

- 17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ దీపిక



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11: రెండు జిల్లాల్లో చోరీ కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. బుధవారం ఆమె ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని పలుచోట్ల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పరవాడ, అనకాపల్లి సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసినట్టు చెప్పారు. వీరి నుంచి సుమారు రూ.12 లక్షలు పైబడి విలువ చేసే 17 తులాల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. విశాఖ నగరంలోని రెల్లివీధికి చెందిన వడ్డాది పోలరాజు, నగర పరిధిలోని చేపలుప్పాడ గ్రామానికి చెందిన చినమన యల్లాజీలను అరెస్టు చేశామన్నారు. పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి సాలాపువానిపాలెంలో గత నెల 27వ తేదీన వంటాకు ఎరుకునాయుడు ఇంట్లో చోరీ జరిగిందన్నారు. ఈ ఘటనలో ఏడు తులాలకు పైగా బంగారు ఆభరణాలు, 20 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయన్నారు. ఈ మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పరవాడ డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి క్లూస్ టీమ్ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టామన్నారు. పైన పేర్కొన్న పోలరాజు, యల్లాజీలను ఈ కేసులో నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్టు చెప్పారు. అలాగే, అనకాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీవోఎస్ కాలనీ, విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్, వీటీ అగ్రహారంలలో కూడా నిందితులు చోరీలకు పాల్పడ్డారని వివరించారు. ఈ నేరాలకు సంబంధించి కొంత సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు చెప్పిన ఆధారంగా ఈ కేసుల్లో దొంగిలించబడిన మరికొంత సొత్తును కొనుగోలు చేసిన నల్లా వెంకటేష్ నుంచి కూడా కొన్ని బంగారం వస్తువులను రికవరీ చేయడమైందని ఆమె తెలిపారు. నిందితులను లంకెలపాలెం జంక్షన్ వద్ద బుధవారం అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడు, సీసీఎస్ ఎస్ఐ పి.రమేష్, పరవాడ సీసీఎస్ పోలీస్ స్టేషన్ల సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

2 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 11: రామచంద్రపురం జంక్షన్‌లో రెండు కిలోల లిక్విడ్ గంజాయితో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన మేడిశెట్టి గోవింద ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు లిక్విడ్ గంజాయి తరలిస్తుండగా, లింగంపేట పంచాయతీ రామచంద్రపురం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. పోలీసులను చూసిన గోవింద ఆటో దిగి బ్యాగ్‌తో సహా పరుగు తీశాడు. దీంతో అనుమానం వచ్చి అతడిని పట్టుకుని బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో లిక్విడ్ గంజాయి ఉంది. దీంతో అతడిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, సెప్టెంబరు 11: కేకే లైనులోని బచేలి, కిరండోల్ మధ్య భారీ వర్షాల కారణంగా విశాఖ-కిరండోల్ మధ్య నడుస్తున్న రైళ్ల గమ్యాలను కుదించి విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా పరిమితం చేశామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18514), విశాఖ-కిరండోల్ ప్రత్యేక రైలు (08551) సర్వీసులు ఈ నెల 12 నుంచి 18 వరకు విశాఖ నుంచి దంతెవాడ మధ్య, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18513), కిరండోల్-విశాఖ ప్రత్యేక రైలు (08552) సర్వీసులు ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు దంతెవాడలో బయలుదేరి విశాఖకు చేరుతాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

తిరుపతి-శ్రీకాకుళంరోడ్డు ప్రత్యేక రైళ్లు రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 11: నిర్వహణ కారణాల దృష్ట్యా తిరుపతి, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య నడిచే ప్రత్యేక రైళ్లను రద్దు చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. తిరుపతి-శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07440) రైలు అక్టోబరు 6 నుంచి డిసెంబరు 1 వరకు, తిరుగు ప్రయాణంలోని శ్రీకాకుళం రోడ్డు-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07441) రైలు అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

గజానికో గండం..!

భారీ వర్షాలకు అస్తవ్యస్తంగా మారిన పలు గ్రామాల రహదారులు

- రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని అంతా వేడుకోలు



సంతపాలెం నుంచి వెల్చూరు వెళ్లే దారిలో...



నేవీ రోడ్డులో సంతపాలెం జంక్షన్ సమీపంలో దుస్థితి

రాంబిల్లి, సెప్టెంబరు 11: వాయుగుండం కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అత్యంత దారుణంగా మారాయి. ఎక్కడికక్కడ తేలి, గోతులు ఏర్పడాయి. వాటిలో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు వాహనచోదకులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. కొన్నిచోట్ల గోతులు చెరువులను తలపిస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వాడ నర్సాపురం నుంచి వెంకటాపురం వెళ్లే నేవీ రోడ్డు, సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు, రాజుకోడూరు, అప్పారాయుడుపాలెం, కృష్ణంపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్ల దుస్థితి చెప్పనక్కర్లేదు. చాలాచోట్ల గొయ్యి ఎక్కడో, రోడ్డు ఎక్కడో గుర్తించడం కష్టంగా ఉంది. వీటిపై ప్రయాణం అంటే సాహసమనే చెప్పాలి. పగటి పూట ఎలాగోలా రాకపోకలు సాగిస్తున్నామని, రాత్రి వేళ ఈ రోడ్లపై ప్రయాణం అంటే భయంగా ఉందని పలువురు వాపోతున్నారు. వర్షాలు పడినప్పుడల్లా గోతులు మరింత పెరిగిపోతున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారని పేర్కొంటున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ రోడ్ల మరమ్మతుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా వాహన చోదకులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రాజుకోడూరు వెళ్లే రోడ్డులో...

వడ్డాది హైస్కూల్‌లో జడ్పీ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 11: వడ్డాది కేఏడీ జడ్పీ హైస్కూల్‌ను జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల నిర్వహణను గురించి ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకట్రావును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి అడగ్గా.. అంతగా బాగుండడం లేదంటూ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో మధ్యాహ్న భోజనం అమలులో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో మళ్లీ స్కూలును సందర్శిస్తానని, అప్పుడు కూడా ఇలాంటి ఫిర్యాదులు అందితే సహించేది లేదంటూ భోజన నిర్వాహకులకు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో జడ్పీటీసీ నిధులతో చేపట్టనున్న చేతి బోరు నిర్మాణ పనులకు సుభద్ర శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచ్‌లు గోపిశెట్టి శ్రీనివాసరావు, పినపోలు రామునాయుడు, పెదిరెడ్ల మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



వడ్డాది హైస్కూల్‌ను తనిఖీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద రెండు గేట్ల ఎత్తివేత



కల్యాణపులోవ రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి అదనపు నీటిని విడిచి పెడుతున్న దృశ్యం

- వరద ప్రవాహం పెరగడంతో వంద క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, సెప్టెంబరు 11: మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండంతో బుదవారం రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల మేర అదనపు నీటిని విడిచిపెట్టినట్టు జేఈ సత్యనారాయణదొర తెలిపారు. 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో ఆది, సోమవారాలు నాలుగు గేట్లు ఎత్తి కొంత నీటిని విడుదల చేశారు. మంగళవారం నాటికి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎత్తిన నాలుగు గేట్లు మూసి వేశారు. అయితే ఇన్‌ఫ్లో 150 క్యూసెక్కుల మేర రిజర్వాయర్‌లోకి వస్తుండడంతో బుధవారం నాటికి 459.02 అడుగులకు నీటి నిల్వలు చేరింది. ఇది రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరువ కావడంతో రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల మేర నీటిని సర్పా నదిలోకి విడిచి పెడుతున్నట్టు జేఈ వెల్లడించారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పును పునఃసమీక్షించాలి

- దళిత నాయకుల డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 11 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్గీకరణను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో దళిత నాయకులు చేపట్టిన ధర్నాకు సంఘీభావంగా పాయకరావుపేటలో సదరు నాయకులు ర్యాలీ, ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా మెయిన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్ తదితరులు మాట్లాడుతూ పార్లమెంట్ ఆమోదం, ఆర్టికల్ 341 సవరణ, రాష్ట్రాల అభిప్రాయ సేకరణ చేయకుండా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, పల్లి దుర్గారావు, కువల కుమార్, తాటిపాక లోవరాజు, పల్లా ప్రసాద్, ఐఎన్ మూర్తి, ఏనుగుపల్లి అప్పారావు, గారా చంటి, రమేష్ పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన కేంద్ర బృందం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : పట్టణంలోని గవరపాలెం అరుంధతినగర్‌లో గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను కేంద్ర బృందం బుధవారం తనిఖీ చేసింది. నేషనల్ క్వాలిటీ, ఎక్యూర్డ్ స్టాండర్డ్ కమిటీ సభ్యులైన డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రమణ స్వాతివామన్‌లు వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవలను వైద్యాధికారి డాక్టర్ వీవీఎస్ జయదీప్ ద్వారా తెలుసుకున్నారు. ఆశ వర్కర్లు వార్డులో అందించిన సేవలపై ఆరా తీశారు.

'వర్షాల వల్ల జీవీఎంసీకి రూ.21 లక్షలు నష్టం'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : వాయుగుండం కారణంగా కొద్దిరోజులుగా కురిసిన వర్షాలకు జీవీఎంసీకి రూ.21 లక్షలు నష్టం వాటిల్లిందని అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 0.3 కిలోమీటర్లు రహదారులు, 0.2 కిలోమీటర్లు కాలువలు దెబ్బతిన్నాయన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి పంపినట్టు చెప్పారు.

పంచ గ్రామాల భూ సమస్యకు పరిష్కారం?

- దేవస్థానానికి సుమారు 426 ఎకరాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- ములగాడ, ఆనందపురం మండలాల్లో భూములు పరిశీలన
- ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు



స్థల పరిశీలన చేస్తున్న ఈవో, అధికారులు

సింహాచలం, సెప్టెంబరు 11: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడిన పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పంచ గ్రామాల్లో అన్యాక్రాంతమైన భూములకు ప్రత్యామ్నాయంగా సింహాచలం దేవస్థానానికి సుమారు 426 ఎకరాల బదలాయింపునకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ బుధవారం ఆనందపురం మండలంతో పాటు గాజువాక సమీపాన గల ములగాడలోని సర్వే నంబరు 35లో భూములను పరిశీలించింది. త్రిసభ్య కమిటీలో దేవస్థానం ఈఓ, రెవెన్యూకు చెందిన ఆర్‌జేసీ కూడా ఉన్నారు. దేవస్థానం భూముల్లో గల 12,149 ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు, అందుకు ప్రత్యామ్నాయంగా సుమారు 426 ఎకరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో తొలుత దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఈనెల ఒకటో తేదీన సింహాచలం దేవస్థానం ఈఓతో కలిసి ప్రత్యామ్నాయంగా రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన ములగాడ భూములను పరిశీలించినట్టు తెలుస్తోంది. బుధవారం మరోమారు భూములు పరిశీలించిన బృందం త్వరలో జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నది. ఇదిలావుండగా పంచగ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు/అభ్యర్థులు హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం అధికారులు ముందుకువెళుతున్నారు.

చందన అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన మంగళవారంనాడు చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి చందన అలంకరణలో స్వామిని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

-చోడవరం



చందన అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

పెంటకోట మెరైన్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



పెంటకోట తీరాన్ని పరిశీలిస్తున్న మెరైన్ ఎస్పీ వర్మ

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 11: మండలంలోని పెంటకోట మెరైన్ పోలీసు స్టేషన్‌ను మెరైన్ విభాగం ఎస్పీ పీవీఆర్ఎస్ఎస్ఎస్ఆర్ వర్మ బుధవారం సందర్శించారు. తొలుత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తీర ప్రాంతంలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తీర ప్రాంత పరిరక్షణకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీర ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నారీమణి, ఎస్ఐ డి.రత్నశేఖర్, ఏఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు నివాళి



అటవీ అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కొత్తూరు, సెప్టెంబరు 11 : జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని బుధవారం అనకాపల్లి పరిధి కొత్తూరులో నిర్వహించారు. జిల్లా అటవీ శాఖాధికారి జి.లక్ష్మణ్ హాజరై అటవీ అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందులో నిర్లక్ష్యం చూపితే జీవకోటికి ఇబ్బందులు తప్పవన్నారు. అటవీ సందప రక్షణకు అంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్లు చంద్రశేఖర్, లావణ్య, గౌరీష్, సుబ్బారావులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలు ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి చంద్రశేఖర్‌దేవ్



వాలాబులో వైద్య శిబిరం పరిశీలిస్తున్న డీఐవో చంద్రశేఖర్ దేవ్

దేవరాపల్లి, సెప్టెంబరు 11: జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో సత్వరమే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి కె.చంద్రశేఖర్ దేవ్, జిల్లా మలేరియా అధికారి కె.వరహాలు దొర తెలిపారు. వాలాబులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వీరు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జ్వరాల వ్యాప్తికి కారణాలు పరిశీలించి నియంత్రణ చర్యలు చేపట్టడం, వైద్య శిబిరాల ఏర్పాటు, మందుల పంపిణీ తదితర చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం దేవరాపల్లి పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాలు భద్రపరిచే గది, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పూజితామేఘన, పర్యవేక్షకులు పుష్పరాజు, ఫార్మాసిస్ట్ సత్యమూర్తి, రవితేజ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

13న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 13న నిర్వహించనున్నట్టు కార్యదర్శి ఎంవీడీ ఫణిరాం తెలిపారు. ఈనెల నాలుగున స్టాండింగ్ కమిటీ సమావేశం జరగాల్సి ఉన్నప్పటికీ విజయవాడలో వరదలు కారణంగా కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులు అక్కడ సహాయకచర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిపోవడంతో సమావేశం వాయిదా పడింది. సమావేశం కోసం ఇప్పటికే 280 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు పంపిణీ చేశారు. అదే అజెండాతో శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు ఫణిరాం తెలిపారు.

30న పెన్షన్ అదాలత్

విశాఖపట్నం, సెప్టెంబరు 11: ఎంవీపీ కాలనీలోని ఆర్ఎంఎస్ కార్యాలయం ఆవరణలో ఈనెల 30న ఉదయం 11 గంటలకు పెన్షన్ (డాక్) అదాలత్ నిర్వహించనున్నట్టు డివిజన్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంవీపీ కాలనీలోని బస్ డిపో సమీపంలో ఉన్న పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్ కింద అంతస్థులో తపాలా సేవలు, పెన్షన్‌లకు సంబంధించి ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. ఆర్ఎంఎస్ - వి.విభాగానికి చెందిన మెయిల్స్, స్పీడ్ పోస్ట్ కథనాలు, పార్శిల్స్, మనీ ఆర్డర్‌లకు సంబంధించిన అన్ని సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వి.డివిజన్ పరిధిలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆర్ఎంఎస్/పెన్షన్ అదాలత్ అన్న శీర్షికతో ఈనెల 23వ తేదీలోగా ఫిర్యాదులను సూపరింటెండెంట్, ఆర్ఎంఎస్ - వి.డివిజన్, విశాఖపట్నం 530017 అన్న చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.

వరద బాధితుల సేవలో యువ వైద్యుడు

చత్రాపల్లి క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు

రోగులను తరలించే మార్గం లేక ప్రత్యామ్నాయంగా చికిత్స

ఆదివాసీల మన్ననలు పొందుతున్న డాక్టర్ సందీప్

చింతపల్లి, సెప్టెంబరు 11: చత్రాపల్లి వరద బాధితులకు యువ వైద్యుడు ఈశ్వర్ సందీప్ ఆపద్బాంధవుడిగా నిలిచారు. కొండచరియలు విరిగిపడి తీవ్రంగా గాయపడిన ఆదివాసీలకు సకాలంలో వైద్య సేవలు అందించి శభాష్ అనిపించుకున్నారు. రోగులను తరలించే మార్గం లేకపోవడంతో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో చికిత్స చేసి అందరి మన్ననలు పొందారు.

చత్రాపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి కొండచరియలు విరిగిపడి కుమారి మృతి చెందగా, పలువురు గాయపడ్డారనే సమాచారం సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఈశ్వర్ సందీప్‌కు సోమవారం ఉదయం అందింది. వెంటనే సిబ్బందితో కాలినడకన గ్రామానికి వెళ్లి, స్థానిక గిరిజనుల సహాయంతో క్షతగాత్రులను సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సప్పర్ల-జీకే వీధి, సీలేరు మార్గాల్లో వంతెనలు కొట్టుకుపోవడం, కొండచరియలు విరిగి పడడంతో బాధితులను మెరుగైన చికిత్స కోసం చింతపల్లి, కేజీహెచ్‌కు పంపించే మార్గంలేక డాక్టర్ సందీప్ ప్రత్యామ్నాయంగా అత్యవసర చికిత్స పద్ధతులను పాటిస్తూ వైద్యం అందించారు. నేటికీ రహదారులు పునరుద్ధరించకపోవడం వల్ల బాధిత గిరిజనులను సప్పర్ల పీహెచ్‌సీలోనే వైద్యాధికారి చికిత్స అందిస్తున్నారు.

సాధారణంగా గిరిజన ప్రాంతంలో పనిచేసే వైద్యాధికారులు మైదాన ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అతి తక్కువ మంది మూడు, నాలుగు రోజులు స్థానికంగా ఉన్నా, శని, ఆదివారాలు కచ్చితంగా గృహాలకు వెళ్లిపోతారు. ఒకరిద్దరు మాత్రమే పనిచేస్తున్న గ్రామంలో బస చేస్తున్నారు. అయితే కనీస సదుపాయాలు అందుబాటులో లేకపోయినా సప్పర్ల పీహెచ్‌సీ వద్ద రేకుల షెడ్డులోనే ఏడాదిగా డాక్టర్ సందీప్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. గత ఆదివారం కూడా వైద్యాధికారి సప్పర్లలోనే ఉన్నారు. ఒకవేళ ఆదివారం వారాంతర సెలవు అని మైదాన ప్రాంతాలకు వెళ్లి ఉంటే మరుసటి రోజు తిరిగి ఆస్పత్రికి వెళ్లే అవకాశం లేదు. అర్ధ రాత్రి కురిసిన వర్షానికి జీకే వీధి-సీలేరు రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. చత్రాపల్లిలో కొండచరియలు విరిగిపడ్డ విషయం బాహ్యప్రపంచానికి తెలిసినప్పటికీ ఎవరూ గ్రామాన్ని సందర్శించి బాధితులకు సహాయక చర్యలు అందించలేని పరిస్థితి ఎదురైంది. ఐటీడీఏ పీవో వి.అభిషేక్, టీడబ్ల్యూ ఇంజనీరింగ్ ఈఈ డీవీఆర్ఎం రాజు, మండల అధికారులు సోమవారం చత్రాపల్లి వెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ కొండచరియలు, కూలిపోయిన వంతెనలు ఆటంకంగా మారాయి. దీంతో బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారి ఈశ్వర్ సందీప్‌కు ఐటీడీఏ పీవో సప్పర్ల సమాచారం పంపించి సంపంగిగొంది నుంచి వెనక్కి వచ్చేశారు. వైద్యాధికారి సప్పర్లలోనే అందుబాటులో ఉండడంతో కొండచరియలు విరిగిపడి గాయపడిన కొర్ర పండన్న, సుమిత్ర, సుబ్బారావులకు చికిత్స సకాలంలో అందింది. ఆయన లేకపోతే క్షతగాత్రులకు కనీస ప్రాథమిక వైద్యం కూడా అందే పరిస్థితి ఉండదని స్థానికులు చెబుతున్నారు.





చత్రాపల్లి గ్రామానికి కాలినడకన వెళ్తున్న డాక్టర్ సందీప్... సుమిత్ర వేసిన కట్టును పరిశీలిస్తున్న సందీప్

ప్రత్యామ్నాయంగా అత్యవసర పద్ధతులతోనే చికిత్స

కొండచరియలు విరిగిపడడంతో తీవ్రంగా గాయపడ్డ పండన్న, సుమిత్రకు ఈసీజీ, ఎక్స్‌రే తీసే పరికరాలు పీహెచ్‌సీలో లేవు. సుమిత్రకు కాలు ఎక్కడెక్కడ విరిగిందో తెలుసుకోలేని పరిస్థితి. విరిగిపోయిన కాలుకు సిమ్మెంట్ కట్టుకట్టే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో డాక్టర్ సందీప్ ప్రత్యామ్నాయ అత్యవసర చికిత్స పద్ధతులు పాటిస్తూ వెదురు కర్రలు, బ్యాండేజ్ సాయంతో కట్టుకట్టారు. ఆమె కదలకుండా చర్యలు తీసుకున్నారు. పండన్న, సుబ్బారావుకు సప్పర్ల పీహెచ్‌సీలోనే చికిత్స అందుతున్నది. సుబ్బారావు ప్రస్తుతం కోలుకున్నాడు. పండన్న కోలుకోవడానికి సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి క్షతగాత్రులకు వైద్యాధికారి పర్యవేక్షణలో చికిత్స అందుతున్నది. దీంతో అత్యవసర సేవలు అందించిన డాక్టర్ సందీప్, దిగువ స్థాయి ఉద్యోగులు ఆదివాసీ మన్ననలు అందుకుంటున్నారు.



పచ్చటి కొండకు నీటి 'బొట్టు'

ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. కొండలు కోనలు దాటుతూ పచ్చని శిఖరాగ్రంపై నుంచి ఉరకలేస్తూ దూకుతోంది. ఆ వడికి నీటి తుంపరల మేఘం ఆవిష్కృతమైంది. పక్కనే పిల్ల జలపాతమొకటి తెల్లగా నురగలు కక్కుతోంది. సుమారు రెండు కిలోమీటర్లు కొండ దిగువకు వెళితే కనిపించే అత్యద్భుత డుడుమ జలపాతాల సౌందర్య దృశ్యమిది. 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటికి ఇలా చిక్కింది.

- ముంచంగిపుట్టు

ఇసుక వినియోగంపై ఆంక్షలు వద్దు

- స్లాట్ బుకింగ్‌పై గిరిజనులకు కనీస అవగాహన లేదు
- ప్రజా సమస్యలను సచివాల ఉద్యోగులు పక్కన పెట్టొద్దు
- కొయ్యూరు మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

కొయ్యూరు, సెప్టెంబరు 11: స్లాట్ బుకింగ్‌పై గిరిజనులకు అవగాహన లేదని, ఆంక్షలు లేకుండా ఇసుక వినియోగించుకునేలా చూడాలని సభ్యులు కోరారు. అలాగే సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలను పక్కన పెట్టడం సరికాదని మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు తదితర విషయాలపై ఎంపీడీవో మేరీరోస్ సభ్యులకు వివరించారు. అనంతరం శాఖల వారీగా ప్రగతి నివేదికలను సభ ముందు ఉంచారు. అనంతరం డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు బిడజాన అప్పారావు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చినప్పటికీ, గిరిజనలకు అవగాహన లేక స్లాట్‌బుక్ చేసుకోలేరని, ఇసుక పొందే విధి విధానాలు తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. అందువల్ల స్థానికంగా కొండవాగు ప్రవాహాల ద్వారా దొరికే ఇసుకను గిరిజనులు వారి అవసరాలకు స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై సభ్యులు సమ్మతి తెలిపడంతో, తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు ఎంపీపీ రమేష్‌బాబు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు చిన్నపాటి పొరపొచ్చాలతో రోడ్డుకెక్కుతూ ప్రజా సమస్యలను పక్కనపెడుతున్నారని, ఉద్యోగుల్లో ఏదేని చిన్నపాటి సమస్య ఉన్నా తమంతట తాము పరిష్కరించుకుని ప్రభుత్వ ఆశయం నెరవేర్చేలా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే వాతావరణ పరిస్థితులు దృష్ట్యా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే రైతులకు పండ్ల తోటలు పెంపకానికి మొక్కలు పంపిణీ చేశామన్నారు. మినీ గోకులాల నిర్మాణాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఉమాదేవి మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నట్టు తెలిపారు. అటవీ అనుమతులు లేక బోయపూట గ్రామానికి విద్యుత్ లైన్ ఏర్పాటులో జాప్యం జరుగుతున్నదని ఏఈ సత్యనారాయణ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, 33 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్‌బాబు... పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే, కలెక్టర్

కైలాసపట్నం బాధితులకు చెక్కుల పంపిణీ

పాడేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నం ఘటనలో బాధితులైన ముగ్గురు విద్యార్థులకు రూ.50 వేలు చొప్పున కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కలెక్టరేట్‌లో బుధవారం చెక్కులను అందించారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ తూములోవ గ్రామానికి చెందిన విద్యార్థులు కొర్రా సురేశ్, కొర్రా గణేష్ తండ్రికి రూ.1 లక్ష, పాంగి నంది తల్లి సాలిమి రూ.50 వేలు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా తమకు ఆధార్, రేషన్‌కార్డులు లేవని కలెక్టర్‌కు చెప్పడంతో, రెండు రోజుల్లో తూములోవ మొబైల్ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి అందరికీ కార్డులు అందిస్తామన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: ఎమ్మెల్యే

అనంతగిరి/డుంబ్రిగుడ, సెప్టెంబరు 11: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. అనంతగిరి, డుంబ్రిగుడ మండల కేంద్రాల్లో బుధవారం జరిగిన పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులకు, బాలింతలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలని సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల-1 పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థినుల సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే విద్యార్థినులకు పెడుతున్న మెనూను పరిశీలించారు. విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు శెట్టి నీలవేణి, ఈశ్వరి, డుంబ్రిగుడ జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీడీవోలు నగేష్, ఉషారాణి, డుంబ్రిగుడ తహసీల్దార్ నాగమ్మ, డీటీ మాణిక్యం, సీడీపీవోలు సంతోషికుమారి, సూర్యకుమారి, నీలిమ, నాయకులు వెంకటరావు, స్వామి పాల్గొన్నారు.

బలిమెల నుంచి నీరు విడుదల

... 5వ పేజీ తరువాయి

తగ్గుముఖం పట్టడంతో ఇక్కడ నీటిమట్టం 1,030 అడుగులకు చేరినే నేపథ్యంలో బుధవారం ఉదయం డొంకరాయి నుంచి నీరు విడుదలను నిలిపివేశారు. అయితే బలిమెల నుంచి 21 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మళ్లీ డొంకరాయి జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉండడంతో సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ రామభద్రరాజు ఆదేశాల మేరకు రెండు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు, మరో 3,800 క్యూసెక్కుల నీటిని కెనాల్‌కు విడుదల చేస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన రోడ్ల పునరుద్ధరణ

... 5వ పేజీ తరువాయి

శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవో పాల్గొన్నారు.

శరవేగంగా పనులు

సీలేరు: వరద ఉధృతికి సీలేరుకు వెళ్లే అన్ని మార్గాల్లో కొండచరియలు, చెట్లు విరిగి పడడంతో రాకపోకలు నిలిచి పోయాయి. సీలేరు- నర్సీపట్నం, సీలేరు- భద్రాచలం, సీలేరు- ఒడిశా వెళ్లే రహదారుల్లో మూడు రోజులుగా ఎటువంటి వాహనాల రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. సీలేరు నుంచి దుప్పులవాడ మార్గంలో గత మూడు రోజులుగా రహదారిపై పడిన కొండచరియలు, చెట్లు, బురద తొలగించే చర్యలు చేపట్టినా సగం పనులు కూడా పూర్తి కాలేదు. అలాగే ధారాలమ్మ ఘాట్‌లో సప్పర్ల వరకు ఉన్న రహదారిలో కొండచరియలు, చెట్లు విరిగిపడ్డాయి. ఈ పనులు వేగంగా చేపట్టి రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.



చత్రాపల్లి గిరిజనులకు రేషన్, దుస్తులు అందజేస్తున్న పీవో అభిషేక్

చింతలూరు అతిసార బాధితులకు మెరుగైన వైద్యం

- డీసీహెచ్ఎస్ డాక్టర్‌కె. కృష్ణారావు... 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

చింతపల్లి, సెప్టెంబరు 11: మండలంలోని చింతలూరు అతిసార బాధితులకు ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.కృష్ణారావు తెలిపారు. 'చింతలూరులో అతిసార' అనే శీర్షికన గిరిజనుల వ్యాధుల పరిస్థితిని వివరిస్తూ బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. ఈ మేరకు చింతలూరు గ్రామాన్ని సందర్శించి బాధితులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు పారిశుధ్యం మెరుగు కోసం పనులు చేపట్టాలని డీసీహెచ్ఎస్ కృష్ణారావు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ సందర్శించి రోగులకు అందుతున్న వైద్యాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొర్ర రాము, అర్జున్ వాంతులు, విరేచనాలతో సోమవారం ఏరియా ఆస్పత్రికి వచ్చారన్నారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. రాముకు డీహైడ్రేషన్ కారణంగా కిడ్నీలు ఫెయిల్ కావడంతో మృతి చెందాడన్నారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో కొర్ర లక్ష్మణరావు, సంపరి లక్ష్మి, గెమ్మెలి శాంతికి మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అలాగే ఎంపీడీవో పి.ఆశాజ్యోతితో కలిసి డీఎల్‌పీవో చింతలూరు గ్రామాన్ని సందర్శించారు. పారిశుధ్య పనులు చేయించి బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఊటకు క్లోరినేషన్ చేయించారు. ఏరియా ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామంలో ఆదివాసీలు తాగుతున్న నీటిని పరీక్షల కోసం పంపిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని కొనసాగించాలని లంబసింగి పీహెచ్‌సీ వైద్యులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ జి.ప్రభావతి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అతిసార బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్

అటవీ అమరవీరులకు ఘన నివాళులు

పాడేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరులైన అటవీ శాఖ ఉద్యోగులకు బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. పాడేరు డివిజనల్ అటవీ శాఖాధికారి కార్యాలయంలో అటవీ అమరవీరుల స్మారక దినం సందర్భంగా డీఎఫ్‌వో కె.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక అటవీ రేంజ్ అధికారి శ్రీనివాస్ అటవీ అమరవీరుల దినం ప్రత్యేకతను వివరించారు. అడవుల సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరుల చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. అడవుల కోసం తమ ప్రాణాలనే ఫణంగా పెట్టిన అమరుల త్యాగాల స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. అటవీ రేంజ్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

చింతపల్లిలో...

చింతపల్లి, సెప్టెంబరు 11: జాతీయ అటవీ అమరుల దినం పురస్కరించుకుని మండల కేంద్రంలో ఉద్యోగులు ర్యాలీ చేశారు. అనంతరం విధి నిర్వహణలో మరణించిన అమరులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చింతపల్లి డీఎఫ్‌వో చిట్టపులి సూర్యనారాయణ పడాల్ మాట్లాడుతూ అడవులు, అడవి జంతువుల పరిరక్షణకు అటవీ శాఖ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో స్మగ్లర్లు, అడవి మృగాలు, ప్రమాదవశాత్తు ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. అమరుల కుటుంబాలకు మనోధైర్యం కలగాలని, వారి ఆశయ సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లోతుగెడ్డ రేంజ్ అధికారి ఎల్‌వీకే పాత్రుడు, చింతపల్లి, పెదవలస రేంజ్ అధికారులు అప్పారావు, శివరంజని, డీఆర్‌వో వెంకటరాజు పాల్గొన్నారు.





చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న అటవీ శాఖ ఉద్యోగులు... పాడేరులో అటవీ అమరులకు నివాళులర్పిస్తున్న డీఎఫ్‌వో

కూటమి సర్కార్‌లో వైసీపీ నేతల హవా?

... 5వ పేజీ తరువాయి

సహజం. కానీ టీడబ్ల్యూ డీడీపై ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదుపై కనీస విచారణ చేయకపోగా, ఫిర్యాదు ఇచ్చిన రోజే బదిలీ ఫైల్ సిద్ధం చేయడం విశేషం. వాస్తవానికి జిల్లా స్థాయి అధికారి అయిన గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడ్ని బదిలీ లేదా సస్పెన్షన్ చేసే అధికారం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ లేదా ప్రధాన కార్యదర్శికి ఉంటుంది. అలాగే సదరు డీడీ పని తీరు బాగోకపోతే ఐటీడీఏ పీవోకు తెలియజేయడం, ఆయనపై క్రమశిక్షణ లేదా శాఖాపరమైన చర్యలను చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ లేదా ప్రధాన కార్యదర్శికి సిఫారసు, సరెండర్ చేయవచ్చు. కానీ అటువంటి ఏ నిబంధనలు పాటించకుండా కేవలం ఎమ్మెల్యే ఫిర్యాదు ఆధారంగా అదే రోజు టీడబ్ల్యూ డీడీ బదిలీకి ఉత్తర్వులు సిద్ధం చేయడం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఒక వేళ టీడబ్ల్యూ డీడీ పని తీరు బాగోకపోతే ఇదే జిల్లాలో మరో ఐటీడీఏకు బదిలీ చేయడం హాస్యాస్పదంగా ఉందని ఐటీడీఏ అధికారులు అంటున్నారు. ఇటువంటివి ప్రోత్సహిస్తే భవిష్యత్తులో అధికారులకు వైసీపీ ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

తీరు మారని పోలీసు యంత్రాంగం

జిల్లాలో పోలీసు యంత్రాంగం తీరు ఇంకా మారలేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉన్నట్టుగానే పోలీసులు వ్యవహరిస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తున్నది. ముఖ్యంగా రంపచోడవరం, చింతూరు పోలీస్ డివిజన్ల పరిధిలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఈ రెండు డివిజన్లు ఏలూరు రేంజ్ పరిధిలో ఉండడం, పరిపాలన పరంగా అల్లూరి జిల్లాలో ఉండడంతో ఎవరూ అక్కడ పోలీసు అధికారులను పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ప్రజా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీసులపై చర్యలు చేపట్టాలని గతంలోనే రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి ఉన్నతాధికారులను కోరినా పట్టించుకోలేదనే తెలిసింది. ముఖ్యంగా చింతూరు సీఐగా పని చేసిన గజేంద్రకుమార్ తీరుపై ఎమ్మెల్యే పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆఖరుకు గత నెలలో ఛత్తీస్‌గఢ్ విలేకరులపై అక్రమ గంజాయి కేసు పెట్టిన విషయంపై రాష్ట్ర హోం మంత్రికి వివరాలతో ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాలతో ఎట్టకేలకు ఆయనను వీఆర్‌కు పంపారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. గతంలో వలే రంపచోడవరం డివిజన్ పరిధిలో ఇప్పటికీ కోడి పందేల నిర్వహణకు పోలీసులు సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే గతంలో పాడేరు డివిజన్‌లోని పలువురు గిరిజనులపై దురుసుగా ప్రవర్తించిన పోలీసులపైనా అధికారులు కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వ పాలనలో అధికార యంత్రాంగం, పోలీసులు ప్రజలకు అనుగుణంగా చట్టబద్ధంగా పాలన సాగించాలని పదే పదే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచిస్తున్నప్పటికీ గిరిజన ప్రాంతంలో వైసీపీ వేళ్లూనుకోవడంతో అధికార యంత్రాంగంలో మాత్రం అదే బాణీ కొనసాగుతున్నదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

సంక్షిప్తంగా..

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా సతకా బుల్లిబాబు

పాడేరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా సతకా బుల్లిబాబును నియమిస్తూ ఏపీ కాంగ్రెస్ కమిటీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల చేతుల మీదుగా బుల్లిబాబుకు డీసీసీ అధ్యక్ష నియామకపత్రాన్ని బుధవారం అందించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా బుల్లిబాబు పేర్కొన్నారు.



బుల్లిబాబుకు నియామకపత్రం అందిస్తున్న షర్మిల

గిట్టుబాటు ధర లేని సీతాఫలాలు

- వారపు సంతలో 80 కాయల బుట్ట రూ.230 నుంచి రూ.300కు విక్రయాలు
- నిరాశతో వెనుదిరిగిన గిరిజన రైతులు



కించుమండ వారపు సంతలో విక్రయానికి తీసుకువచ్చిన సీతాఫలాలు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 11: మండలంలోని కించుమండ వారపు సంతలో విక్రయానికి తీసుకువచ్చిన సీతాఫలాలకు తగిన గిట్టుబాటు ధర లభించలేదు. దీంతో గిరిజన రైతులు నిరాశకు గురయ్యారు. బుధవారం కించుమండలో జరిగిన వారపు సంతకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో రైతులు సీతాఫలాలను తీసుకువచ్చారు. అయితే వ్యాపారులు ఎక్కువగా రాకపోవడం, వచ్చిన వారు కూడా తక్కువ ధరకు సీతాఫలాలను అడగడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వివిధ మారుమూల గ్రామాల నుంచి తట్టలు, కావిళ్లతో అధిక బరువులు మోస్తూ సీతాఫలాలను వారపు సంతలకు తీసుకువస్తామని, కష్టానికి తగిన ప్రతిఫలం లేకపోతే ఎలాగని రైతులు వాపోయారు. చివరి వరకూ నిరీక్షించినా సరైన ధర రాకపోవడంతో వారంతా దిగాలు చెందారు. గత్యంతరం లేక 80 కాయలు ఉన్న బుట్టను రూ.230 నుంచి రూ.300 వరకు విక్రయించి, వారికి కావాల్సిన కొన్ని నిత్యావసర సరకులను కొనుగోలు చేసుకుని నిరాశతో వెనుదిరిగారు.

అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

చింతపల్లి, సెప్టెంబరు 11: చింతలూరు అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. బుధవారం గ్రామాన్ని సందర్శించి బాధితులకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. అలాగే ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసారతో ఒకరు మృతి చెందడం, పలువురు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. అతిసార ప్రబలడానికి గల కారణాలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. రోగాలు అదుపులోకి వచ్చే వరకు గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీ వెంగళరావు, సర్పంచ్ సమిడి గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు, వైసీపీ నేతలు జల్లి సుధాకర్, బూసరి కృష్ణ, మోరీ రవి పాల్గొన్నారు.

'చత్రాపల్లి ఘటనపై వైసీపీ దుష్ప్రచారం సరికాదు'

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 11: చత్రాపల్లి ఘటనపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం సరికాదని ఎన్డీయే కూటమి నాయకుడు పండా రామకృష్ణ అన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొండచరియలు విరిగిపడిన మరుసటి రోజే గ్రామానికి రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు వెళ్లడం జరిగిందన్నారు. సప్పర్ల పీహెచ్‌సీలో గిరిజనులకు వైద్య సేవలు అందించారన్నారు. సప్పర్ల గ్రామంలో మూడు పునరావాస కేంద్రాల్లో 147 మందికి ప్రతీ రోజు భోజన, వసతి కల్పించారన్నారు. మృతురాలు కుమారి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారన్నారు. బుధవారం కాలినడకన సప్పర్ల, చత్రాపల్లి వచ్చిన పీవో స్వయంగా ఆదివాసీల పరిస్థితిని పరిశీలించారని, ఆదివాసీలకు అవసరమైన నిత్యావసర సరకులు అందజేశారన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంగళవారం చత్రాపల్లి ప్రయాణమైనప్పటికీ, వచ్చే మార్గంలేక గ్రామానికి రాలేకపోయారన్నారు. ఇప్పటికైన వైసీపీ నాయకులు మానవత్వంలో మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు బీమన్న, కిల్లో సత్యారావు, చత్రాపల్లి నాయకులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో అన్న సమారాధన

డుంబ్రిగుడ, సెప్టెంబరు 11: మండల కేంద్రంలో వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. జీసీసీ మేనేజర్ లండా దామోదర్ దంపతులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

పెదబయలు, సెప్టెంబరు 11: రూడకోట-జామిగూడ రహదారి, కల్వర్టుల నిర్మాణాల్లో కనీస నాణ్యత పాటించకపోవడంతోనే మరమ్మతులకు గురయ్యాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణ చేయని అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జామిగూడ మార్గంలో వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులు, రహదారులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, పార్టీ మండల కార్యదర్శి బొండా సన్నిబాబు బుధవారం పరిశీలించారు. ఈ మార్గంలో వేసిన తారు రోడ్డు, కల్వర్టుల నిర్మాణాల్లో నాణ్యత లేదని ఆరోపించారు. దీంతో పలు చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయని, అటుగా రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇలా జరిగిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.ధర్మన్నపడాల్, సునీల్ కుమార్, బజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.